

మార్కెట్‌యార్డ్‌కు భారీగా పసుపు

ఖిల్లా,ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో గల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం సుమారు 10వేల పసుపును రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. బాగ ఎండిన పసుపుని తీసుకొని రావడంతో గరిష్ఠంగా 12వేల 567పలుకగా, కనిష్ఠంగా 10వేల ధర పలికింది. అదే విధంగా రూ.11వేల 500 మోడల్ ధరగా మార్కెట్ అధికారులు నిర్ణయించారు. శని,ఆదివారాల్లో మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరగనందున సోమవారం రైతులు ఎక్కువగా పసుపును తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు.



యూరప్ వీసాల పేరిట మోసం!

- జిల్లాలో రూటు మార్చిన నకిలీ గల్ఫ్ ఏజెంట్లు
- యూరప్ దేశాల్లో రూ. లక్షల్లో జీతాలంటూ సామాన్యులకు ఎర
- రష్యా, కెనడా, లండన్, ఇజ్రాయిల్ అంటూ డబ్బుల వసూళ్లు
- యూరప్‌కు పంపకుండానే ఐపీ పెడుతున్న ఏజెంట్లు
- అప్పులపాలవుతున్న అనేక మంది బాధితులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల్ఫ్ ఏజెంట్లు రూటు మార్చారు. గల్ఫ్ పంపిస్తే తక్కువ డబ్బులు వస్తాయని.. యూరప్ దేశాల్లో లక్షల్లో జీతాలంటూ సామాన్యులకు ఎర వేస్తున్నారు. లక్షల్లో డబ్బులు తీసుకుంటూ యూరప్ దేశాలకు పంపకుండానే ఉడాయిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో యూరప్ దేశాలకు వీసాలంటూ కొత్తగా కార్యాలయాలు తెరిచి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు. డబ్బులు ఎక్కువ సంపాదించాలనే ఆశతో యువకులు యూరప్ దేశాల మోజులో పడి కుటుంబాలను అప్పులపాలు చేస్తున్నారు. ఇదివరకు బతుకు దెరువు కోసం అరబ్ దేశాలకు వెళ్లి ఎంతోకొంత కూడబెట్టుకుని దేశానికి తిరిగి వచ్చేవారు. ప్రస్తుతం లక్షల్లో సంపాదించవచ్చని యూరప్ దేశాల వీసాల కోసం లక్షల రూపాయలను ఏజెంట్లకు అప్పజెప్పి అప్పులపాలవుతున్నారు. వీసాల కోసం వేల సంఖ్యలో యువకులు ఏజెంట్లకు డబ్బులు ఇస్తే కేవలం పదుల సంఖ్యలోనే వీసాలు వస్తున్నాయి. పది వీసాలను చూసి వేలల్లో యువకులను మోసం చేసే ప్రయత్నాలను ఏజెంట్లు చేస్తున్నారు. తాజాగా జిల్లా కేంద్రంలో కార్యాలయాలను తెరిచి వీసాల పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. రష్యా, కెనడా, లండన్, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్ అంటూ డబ్బులు తీసుకుని వీసాలు ఇవ్వకపోవడంతో డబ్బులు ఇచ్చిన బాధితులు అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలో రష్యా వీసాలంటూ కొందరు ఏజెంట్లు హడావుడి చేస్తున్నారు. లక్షల్లో జీతం అంటూ అమాయక ప్రజలను బుట్టలో వేసుకుంటున్నారు. వీసాలు రాకపోవడంతో ఏజెంట్ల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు ఏజెంట్లు వీసాలకని వందలాది మంది దగ్గర డబ్బులు తీసుకుని వచ్చిన నగదును తమసొంత ప్రయోజనాలకు వాడుకుని బాధితులు డబ్బులు అడిగితే ఐపీలు పెట్టి బెదిరిస్తున్నారు.

హైదరాబాద్, ఢిల్లీ కేంద్రంగా మోసాలు

జిల్లాకు చెందిన గల్ఫ్ ఏజెంట్లు రూటుమార్చి యూరప్ దేశాలు పంపిస్తామని బాధితుల దగ్గర డబ్బులు తీసుకుంటున్నారు. హైదరాబాద్, ఢిల్లీ కేంద్రంగా తమకు చెందిన పెద్ద బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పి ఇక్కడి ప్రజలను నమ్మిస్తున్నారు. హైదరాబాద్, ఢిల్లీ కేంద్రంగా ఉన్న ప్రధాన ఏజెంట్లు వీరికి కనీస పరిచయం లేకున్నా ఫోన్‌లోనే పరిచయాలు పెంచుకుని వారికి పాస్‌పోర్టులను అందజేస్తున్నారు. అయితే వీసాలు ఎంతకీ రాకపోవడంతో ప్రధాన ఏజెంట్ల గురించి వాకబు చేసే సరికి వారు సైతం వీరికి అందుబాటులోకి రావడం లేదు. కనీసం వారి కార్యాలయాలు, ఇల్లు చూడకుండానే పాస్‌పోర్టులు, డబ్బులు అందజేసి మోసాలకు పాల్పడుతున్నారు. వారికింత, వీరికింత అని డబ్బులు పంచుకుని బాధితులను అప్పులపాలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మకూడదని పోలీసులు చెబుతున్నా అమాయక ప్రజలు మోసపోతూనే ఉన్నారు.

నకిలీ ఏజెంట్లపై చర్యలు కరువు

జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో సైతం కార్యాలయాలు ఏర్పాటు చేసుకొని బయటి దేశాలకు పంపిస్తామని ప్రచారాలు చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలో లెక్కలేనన్ని కార్యాలయాలు అనుమతులు లేకుండా ఏర్పడ్డాయి. కార్యాలయాన్ని చూసి బాధితులు ఎక్కడికి వెళ్తాడు అనుకొని ఏజెంట్లకు డబ్బులను ముట్టచెబుతున్నారు. నాలుగు రోజులు కాగానే కార్యాలయాన్ని మూసివేసి డబ్బులతో ఉడాయిస్తున్నారు. ఇలాంటి నకిలీ ఏజెంట్లపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మెడికల్ టెస్టుల పేరిట వసూళ్లు

యూరప్ దేశాలకు వెళ్లాలంటే మెడికల్ టెస్ట్ సర్టిఫికెట్‌లు తప్పనిసరి అని గుర్తింపు లేని ల్యాబ్‌లలో టెస్టులు చేయించి ఏజెంట్లు ఇవే సర్టిఫికెట్‌లంటూ చూపిస్తూ బాధితులను బురిడీ కొట్టిస్తున్నారు. జిల్లా కేంద్రంలో గంగస్థాన్, ఖలీల్‌వాడి కేంద్రంగా నకిలీ ఏజెంట్లు కొన్ని ల్యాబ్‌లను దత్తత తీసుకుని ల్యాబ్‌లను నడిపిస్తున్నారు. యూరప్ కంట్రీల మెడికల్ టెస్ట్‌లకు రూ.5వేలకు పైగా అవుతాయని చెప్పి బాధితుల దగ్గర డబ్బులను దండుకుంటున్నారు. మెడికల్ టెస్ట్‌లకు 500నుంచి వెయ్యి రూపాయలు ల్యాబ్‌లకు ఇచ్చి మిగతా డబ్బులను వారి జేబులో నింపుకుంటున్నారు. ఇలా రోజు వందల సంఖ్యలో బాధితులను మెడికల్ టెస్టుల పేరిట తమ జేబులు నింపుకుంటున్నారు. యూరప్ కంట్రీల మెడికల్ టెస్టులు జిల్లా కేంద్రంలో అనుమతి ఉన్న ల్యాబ్ ఒక్కటి మాత్రమే ఉంది. కానీ ఏజెంట్లు తమ ఇష్టం వచ్చిన దగ్గర మెడికల్ టెస్టులు చేయించి డబ్బులను తీసుకుంటున్నారు. సుమారు రెండు మూడు నెలల నుంచి 800నుంచి వెయ్యిమంది ల్యాబ్ టెస్టులు చేయించారు. కానీ ఇప్పటి వరకు ఒక్కరిని కూడా యూరప్ కంట్రీలకు పంపలేదు. ప్రస్తుతం గంగస్థాన్‌కు చెందిన ఏజెంట్ పరారైనట్లు తెలిసింది.

ఐపీలు పెట్టి దర్జాగా తిరుగుతున్న ఏజెంట్లు

జిల్లాకు చెందిన కొందరు ఏజెంట్లు యూరప్ దేశాలు లక్షల్లో జీతం అంటూ ఫోన్ ద్వారా వాట్సాప్ సందేశాలను పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. మెడికల్ టెస్ట్ ఒకే అయిందని హైదరాబాద్, ఢిల్లీ కేంద్రంగా ఉన్న ఏజెంట్లకు డబ్బులు కట్టాలని లక్షల్లో డబ్బులను దండుకుంటున్నారు. నెలలు గడిచినా వీసా రాకపోవడంతో ఏజెంట్లు ముఖం చాటేస్తున్నారు. బాధితులు ఏజెంట్ కార్యాలయం, ఇంటి చుట్టు తిరిగినా ఫలితం ఉండడం లే ద ు. ఎదిరించి అడిగితే లాయర్ ద్వారా ఐపీల నోటీసులు పంపి దర్జాగా తిరుగుతున్నారు. తాజాగా ఇజ్రాయిల్ పంపిస్తామని చెప్పి నందిపేట్‌కు చెందిన ఓ ఏజెంట్ 30మంది దగ్గర మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలు తీసుకుని డబ్బులు అడిగితే లాయర్ ద్వారా ఐపీ నోటీసులు పంపించారు.

హైదరాబాద్‌లో డబ్బులు ఇచ్చాను..

: సురేష్, నందిపేట్



యూరప్ దేశాలు పంపిస్తానంటూ స్నేహితుడి ద్వారా హైదరాబాద్ కేంద్రంగా నడుపుతున్న కార్యాలయానికి వెళ్లి పాస్‌పోర్టు, డబ్బులు ఇచ్చాను. 20లక్షలు ఖర్చవుతుందని, సుమారు 2లక్షల జీతం ఉంటుందని చెప్పడంతో మొదట 50వేల రూపాయలు, తర్వాత లక్ష రూపాయలు ఇచ్చాను. నెలలు గడిచినా వీసా ఇవ్వకపోవడంతో అడగడానికి వెళ్తే అక్కడ కార్యాలయం కూడా లేదు. నాతోపాటు చాలా మందిని ఇలాగే మోసం చేశారు.

ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలి..

: భూమేష్, మచ్చర్ల



యూరప్ దేశాలు పంపిస్తామని చెప్పి ఇష్టం వచ్చినట్లు డబ్బులు తీసుకుంటున్నారు. వీసాకు అవసరమైన డబ్బులు కాకుండా అదనంగా పదింతల డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. గత కొన్ని రోజుల క్రితం మా బంధువుని యూరప్ కంట్రీ పంపిస్తామని ఏజెంట్ డబ్బులు తీసుకొని తిరిగి ఇవ్వకపోగా ఐపీ పెట్టి తమనే వేధిస్తున్నాడు. ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.



ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి



కామారెడ్డిలో ఆత్మహత్యకు పాల్పడ్డ సంజయ్ (ఫైల్)

- బెట్టింగ్ ఆడి రూ.80లక్షలు పోగొట్టుకున్న సంజయ్
- అప్పులు చెల్లించే మార్గం లేకపోవడంతో ఉరేసుకొని బలవన్మరణం
- కామారెడ్డి పట్టణంలో ఘటన

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకోవడమే కాక.. చివరకు అప్పుల పాలై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కామారెడ్డి జిల్లాకేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లికి చెందిన దేవల సంజయ్ (27) స్థానికంగా ప్రైవేటు జాబ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం ఇతనికి తాడ్వాయి మండలం క్రిష్ణాజీవాడికి చెందిన శ్రీలతతో వివాహం జరిగింది. వీరికి ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. సంజయ్ గత రెండేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు అలవాటు పడ్డాడు. తక్కువ కాలంలోనే ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఆశతో బెట్టింగ్ యాప్స్‌లో పలు రకాల గేమ్స్‌తో పాటు తీన్‌పత్తీ ఆడుతూ రూ.లక్షలు కోల్పోయాడు. ఆ తర్వాత బంధువులు, స్నేహితుల వద్ద విడతల వారీగా రూ.80లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీసుకోవద్దంటూ సంజయ్‌కు భార్య శ్రీలత ఎన్నోసార్లు చెప్పినప్పటికీ.. అతనిలో మార్పు రాలేదు. ఈ సమయంలోనే అప్పులు ఇచ్చినవారు తీర్చాలంటూ ప్రతీరోజూ ఇంటి వద్దకు వస్తుండడంతో.. భార్యభర్తల మధ్య గొడవలు తీవ్రమయ్యాయి. దీంతో గత ఆరు నెలల క్రితం శ్రీలత తన పిల్లలతో తల్లిగారి గ్రామమైన క్రిష్ణాజీవాడికి వెళ్లిపోయింది. ఈ సమయంలోనే అప్పులు ఇచ్చిన వారి వేధింపులు ఎక్కువ కావడంతో.. సంజయ్ దేవునిపల్లిలో ఉన్న తన ఇంటిని అమ్మేందుకు ప్రయత్నించాడు. అయితే అనుకున్నంత ధర రాకపోవడంతో ఇంటి అమ్మకాన్ని విరమించుకున్నాడు. ఇతరత్రా ఆస్తులేమి లేకపోవడంతో.. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి సోమవారం తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

తెలంగాణకు బీజేపీతో ఒరిగిందేమీ లేదు

- కేంద్రం నిధుల కేటాయింపులో వివక్షత చూపుతోంది
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

నిజామాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణకు బీజేపీతో ఒరిగిందేమీ లేదని నిధుల కేటాయింపులో కేంద్రం వివక్షత చూపుతోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నగరంలోలో సోమవారం ఉమ్మడి జిల్లా పార్టీ సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా ఏ ఒక్కదానికి నిధులు కేటాయించడం లేదన్నారు. ఆంధ్రాలో పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కుకు నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రానికి మాత్రం ఏ ప్రాజెక్టుకు ఇవ్వలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకో లేదన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమతో పాటు ఇతర సంస్థలకు నిధులు కేటాయించడం లేదన్నారు. తెలంగాణ ఆలస్యం కావడానికి బీజేపీయే కారణమని మంత్రి ఆరోపించారు. బీజేపీతో బీఆర్ఎస్ చేసుకున్న లోపాయికారి ఒప్పందం వల్లనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిని నిలబెట్టలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో పథకాల అమలులో జాప్యానికి మాజీ సీఎం కేసీఆర్ ఏ కారణం అని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా తమ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే పక్కాగా జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పాలనకు కాంగ్రెస్ పాలనకు జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉందని మంత్రి అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన రాహుల్ గాంధీ కుటుంబ మతం గురించి మాట్లాడటం అర్థరహితం అని మంత్రి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారు అవకాశం ఉండి కూడా సీఎం పదవులను తీసుకోలేదన్నారు. రాజకీయాల కోసమే బండి సంజయ్ ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. నిరుద్యోగులకు అండగా ఉండే కాంగ్రెస్ అభ్యర్థికి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. ఉద్యోగులతో పాటు నిరుద్యోగులంతా కాంగ్రెస్‌తోనే ఉన్నారని అన్నారు. బీజేపీ నేతలు ఎన్ని కుట్రలు పన్నినా పార్టీ గెలుపే ఖాయమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, మదన్ మోహన్‌రావు, కార్పొరేషన్ చైర్మన్‌లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి



పోచంపాడ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

మెండోర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల పెట్టిన సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థలు వసతిగృహ సముదాయం స్థలాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. సోమవారం మండలంలో పోచంపాడ్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన స్థలాన్ని మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం, తదితర అంశాలను సంబంధిత అధికారులతో కలిసి చర్చించారు. 25ఎకరాల స్థలం అవసరం ఉన్నందున సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని మెండోర తహసీల్దార్ సంతోష్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, సర్వేయర్ మమత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ముమ్మర ప్రచారం

- సమీపిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గడువు
- జోరు పెంచిన కాంగ్రెస్, బీజేపీ
- మద్దతును కూడగడుతున్న నేతల ప్రయత్నాలు
- సిట్టింగ్‌ను నిలుపుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్
- పాగా వేసేందుకు పావులు కదుపుతున్న బీజేపీ
- వీరికి దీటుగా స్వతంత్ర అభ్యర్థులు

నిజామాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల నేతలు ప్రచారాన్ని ఉధృతం చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం గ్రాడ్యుయేట్‌లతో పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు కాంగ్రెస్ గట్టి ప్రయత్నాలు చేస్తుండగా.. బీజేపీ పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. వీరికి దీటుగా స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచార జోరును పెంచారు. ఎక్కడికక్కడ సమావేశాలను నిర్వహించడంతో పాటు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు మండల స్థాయిలోనే ఉండి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏరోజుకు ఆ రోజు ఓటర్లకు సంబంధించిన వివరాలను తీసుకోవడంతో పాటు మండల, డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ అభ్యర్థుల గెలుపు కోసం గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. రెండు పార్టీల నేతలు గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని సంఘాలను కలుపుకుంటూ తమకు సహకరించాలని కోరుతున్నారు.

ఎనిమిది రోజుల సమయం..

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి ఇంకా ఎనిమిది రోజుల సమయమే ఉంది. ఈలోపే నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో అభ్యర్థులు పర్యటించడం కష్టం కావడంతో ఏ జిల్లాకు ఆ జిల్లాలో పార్టీ నేతలు వారికి మద్దతుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో క్యాడర్‌ను రంగంలోకి దించి అభ్యర్థికి మద్దతు ఇచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండటంతో పూర్తి స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు రంగంలోకి దిగారు. పోటీ ప్రధానంగా ఈ రెండు పార్టీల నేతల మధ్యనే ఉండటంతో గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. వీరికి బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థుల నుంచి కూడా కొంత పోటీ ఉండటం వల్ల అన్ని మండలాల పరిధిలో నజర్ పెడుతూ ఓటర్ల వారిగా మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మండల స్థాయి క్యాడర్‌ను రంగంలోకి దించి గ్రాడ్యుయేట్ ఓటర్లతో పాటు ఉపాధ్యాయ ఓటర్లతో మంతనాలు జరుపుతున్నారు. తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఆర్మూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నందిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నందిపేట మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయంలో, అలాగే చౌడమ్మ కొండూర్ గ్రామంలో చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, నాయకులు కోమన్‌పల్లి రాజన్న, నాయుడు రామారావు, దారం సురేష్, కొండూర్ సంతోష్, దేవిదాస్, గణేష్, సాయి, షాదుల్లా, బోగన్న, ఎస్‌కె మహిబూబ్, ఎస్ నరేష్ తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మాజీముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు సుంకరి రవి, మీరశ్రావణ్, శ్రీకార్, గిరిష్, కాపెల్లి గణేష్, లతిఫ్, హర్షద్, సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మాజీముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు 71వ జన్మదిన వేడుకలను వేల్పూర్ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేసీఆర్ జన్మదిన కేక్‌ను మండల పార్టీ అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జైడి నాగాధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నీరడిబాగ్య, రేగుల్ల రాములు, సొసైటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండలంలో సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాచప్ప, నరేడ్ల శ్రీను, తిప్పారావు, ఆనంద్ గౌడ్, పాల్గొన్నారు.

మెండోర: మండల కేంద్రంలో మాజీసీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండల అధ్యక్షుడు డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలోతలారిగంగాధర్, నవీన్‌గౌడ్, కమలాకర్, మచ్చర్ల రాజారెడ్డి, గోపిడి గంగారెడ్డి, రవిగౌడ్, సతీష్, రాజు, పాల్గొన్నారు.



కోటగిరిలో..

మోస్రా: మోస్రా, చందూర్ మండల కేంద్రాలతో పాటు మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ రెడ్డి, కోతిమీర్‌కర్ విజయ్,.కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింగ రావు, తెడ్డు పోశెట్టి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేం దర్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, రాజారాం సహదేవ్, బద్దం హన్మండ్లు, గన్నారపు రాజేశ్వర్, అట్ల పోశయ్య పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు వేడుకలను కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు బద్దం చిన్నారెడ్డి, మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, హల్దె శ్రీనివాస్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని అమ్మ అనాథ ఆశ్రమంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఫారుఖ్, నవీన్, సమీర్ పాల్గొన్నారు,



కమ్మర్‌పల్లిలో..



ఏర్గట్లలో కేక్ కట్‌చేసిన బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, పీఏసీఎస్‌చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మాజీసర్పంచ్ బోగ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలకేంద్రంలో సోమవారం మాజీ సీఎం కేసీఆర్, నిజామాబాద్‌రూరల్ మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భోజన్ననాయకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: మాజీసీఎం కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, మాజీఎంపీపీ, జడ్పీటీసీలు మహేష్, రవి, నాయకులు భగత్, లింబాద్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందిరంలో పోచారం పూజలు



వర్నిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

వర్ని,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలోని సేవాలాల్ తండాలో సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ మందిర 10వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారాలు పాటలు పాడి నృత్యాలు చేశారు. ఈకార్యక్రమంలో బంజారా సేవా సమితి అధ్యక్షుడు బద్యా నాయక్, వెలగపూడి గోపాల్, నేమాని వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్ పీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి

వేల్పూర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని మండల, గ్రామాల పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు శ్వేత కోరారు.ఈగ్రంథాలయంలో వివిధ రకాల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రిపరేషన్‌కు సంబంధించి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయంలో అందుబాటులో లేని ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు పాఠకులు కోరితే జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, సెక్రెటరీ బుగ్గ రెడ్డిల ద్వారా పుస్తకాలను తెప్పించి పాఠకుల అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అంతేగాకుండా గ్రంథాలయంలో పాఠకుల కోసం వైఫై సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పాఠకులు అన్ని సదుపాయాలు వేల్పూర్ గ్రంథాయానికి వచ్చి పోటీపరీక్షలకు సంబంధించి పుస్తకాలను చదువుతూ ఉద్యోగాన్ని సాధించాలని గ్రంథాలయ పాఠకురాలు స్వాతి కోరారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

మెండోర, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎండి.అజ్మత్‌పాషా అన్నారు. సోమవారం మండలంలో వెల్కటూర్ గ్రామంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యా ర్థులకు కరాటే బెల్టులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అభ్యాసం నుంచి కరాటే నేర్చుకున్నట్టుతే శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసంతో పాటు ఆకతాయిల నుంచి తమకు రక్షించుకోవచ్చని అన్నారు. ప్రతీ తల్లిదండ్రులు విద్యార్థులకు చిన్నప్పటి నుంచి కరాటే వంటి యుద్ధవిద్యనే నేర్పించాలని సూచించారు.ఈకార్యక్రమంలో కరాటే మాస్టర్ శివాణి, అవినాష్, రోషన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లుపాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని ఇన్‌చార్జీ మంత్రికి వినతి

నందిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఇన్‌చార్జీ రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావుకు సోమవారం నందిపేట మండల అబివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు వినతి పత్రం అందజేశారు. 2024 నవంబర్‌లో జరిగిన ల్యాబ్ టెక్నిషియన్ ఫలితాలను వెంటనే విడుదల చేసి ఉత్తీర్ణులైన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, ల్యాబ్ టెక్నిషియన్ నిరు ద్యోగులు రాష్ట్ర మంత్రి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

దీనికి స్పందిం చిన మంత్రి హెల్త్ చీఫ్ సెక్రెటరీకి ఫోన్లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు. ఫలితాలు విడుదల చే యాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ల్యాబ్ టెక్నిషియన్ నిరుద్యోగులు తధితరులు ఉన్నారు.

సబ్ స్టేషన్‌లలో బ్రేకర్లను ప్రారంభించిన ఎస్ఈ

నవీపేట,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్, నాళేశ్వర్‌లలోని 33/11సబ్ స్టేషన్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్లను సోమవారం ఎస్ఈ ఆర్. రవీందర్ ప్రారంభించారు. ఒక్కొక్క సబ్ స్టేషన్‌లో 17లక్షల రూపాయల వ్యయంతో ఈ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అలాగే 33/11జన్నేపల్లి సబ్ స్టేషన్ నుండి కమలాపూర్ సబ్ స్టేషన్ వరకు 40 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 33కేవీ లైన్‌ను సైతం ఆయనప్రారంభించారు.ఈకార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్, ఆయా గ్రామాల వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



బ్రేకర్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ఎస్ఈ రవీందర్

ఆర్మూర్‌లో రైతుల నిరాహార దీక్ష



ఆర్మూర్‌లో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న రైతులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట పసుపునకు క్వింటాలుకు రూ.17వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులు నిరాహర దీక్ష చేపట్టారు. కొమ్ముల వినోద్‌రెడ్డి, నక్కల రాములు, నారాయణపేట్ ముత్యంరెడ్డితో పాటు పలువురు రైతులు రిలే నిరాహర దీక్షలో కూర్చున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దీక్షను పసుపు పంటకు మద్దతు ప్రకటించి రైతులను ఆదుకునే వరకు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. పసుపు పండించేందుకు పెట్టుబడులు ఎక్కువై రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదన్నారు. ప్రస్తుతం క్వింటాలుకు రూ9 నుంచి రూ.10వేల ధర ఉందని, దీంతో రైతులకు నష్టాలే మిగులుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పోశయ్య, ఫత్తేపూర్ గంగారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో పడి ఒకరి మృతి

ముప్కాల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలువలో పంప్ సెట్లు నాచు తొలగించడానికి కాలువలో దిగి కోమరశెట్టి చిన్నయ్య (47) మృతి చెందిన సంఘటన ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామశివారులో గల కాకతీయ కాలువలో పంట పొలాలు పారించుకునేందుకు కాకతీయ కాలువలో పెట్టుకున్న మోటర్ పుట్‌బాల్‌కు చుట్టు ఉన్న నాచును తీయడానికి కాలువలో దిగి చిన్నయ్య ప్రమాదవశాత్తు నీటి వేగానికి కొట్టుకుపోయి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పడిగెలలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

వేల్పూర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలం పడిగెల గ్రామంలోని రైతు వేదికలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వరి పంటలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.వ్యవసాయ విస్తీర్ణాధికారి సాయిరాంరాజ్ మాట్లాడుతూ వరి పంట దిగుబడి కోసం పాటించాల్సిన పద్ధతులపై ఫౌండేషన్ వారు నిర్వహించే కార్యక్రమాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎస్ఆర్ 18, తడిపొడి విధానం, డ్రమ్‌ఫిడర్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో ఆదాయం పెరగడంతో పాటు వరిసాగులో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. వరి సాగులో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని, వరిలో కలుపు తొలగించిన తర్వాత పొట్టవచ్చే సమయం వరకు ఎక్కువ నీరు అవసరం ఉండదని సూచించారు. 45తడులతో తడిపొడి విధానం పాటించి సాగు చేయవచ్చన్నారు. యాసంగి పంట చివరి వరకు పొలాలకు సాగునీరు అందించ వచ్చన్నారు. ఈ పద్ధతులను పాటిస్తే నీటి వృధాను అరికట్టడంతో పాటు వరి పంట నుంచి వెలువడే మిథేన్ వాయువు వల్ల కలిగే గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించి పర్యవరణ కాపాడవచ్చ న్నారు. అనంతరం ఏడబ్ల్యుడీ పైపులు అందజేశారు. వరి పంట కొయ్యాలను కాల్చవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయిరాంరాజ్, ఫౌండేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ చింత శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రెడ్డీస్ సభ్యులు

ఎత్తొండ సొసైటీ బకాయిలపై సహకార బ్యాంకు నోటీసులు

- రూ.కోటి ముప్పై నాలుగు లక్షలు చెల్లించకపోతే భూమి వేలం
- ఆందోళనలో సంఘ సభ్యులు



ఎత్తొండ సహకార సంఘం


FORM NO.6

సహకార బ్యాంకు అధికారులు జారీచేసిన నోటీసు

కోటగిరి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ ప్రాథమిక సహకార సంఘానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. గత ఐదేళ్ల కాలంలో సంఘంలో చోటు చేసుకున్న పరిణామాలు సంఘ ప్రతిష్టను మరింత దిగజారుస్తోంది. సంఘం ఇప్పటికే సుమారు తొమ్మిది కోట్ల రూపాయల నష్టాల భారిన పడగా కొత్తగా సహకార బ్యాంకు అధికారులు సంఘానికి నోటీసులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. సహకార బ్యాంకు అధికారులు తమకు కోటి ముప్పై నాలుగు లక్షల పదివేల ఎనిమిది వందల అరవై రెండు రూపాయలు బకాయి చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. సహకార శాఖ సెక్షన్ 70 ప్రకారం రూల్ 52ను అనుసరించి 10రోజుల్లో వడ్డీతో సహా చెల్లించాలని లేని పక్షంలో సంఘం తనఖా పెట్టిన భూమి సుమారు రెండున్నర ఎకరాల భూమిని వేలం వేస్తామని నోటీసులు అందించారు. సహకార బ్యాంకులో క్యాష్ క్రెడిట్ కింద సుమారు 3కోట్ల రూపాయలు గత పాలక వర్గం అప్పు తీసుకుంది. తీసుకున్న అప్పును ప్రస్తుత పాలక వర్గం కొంతమేర అప్పును వడ్డీతో సహా తీర్చింది. ప్రస్తుతం సుమారు 1,34,10,862 రూపాయల బకాయి ఉంది. సంఘం నిర్వహించిన పలు లావాదేవీల్లో వచ్చిన మొత్తాన్ని సహకార బ్యాంకులో జమ చేసిన వెంటనే బ్యాంకు అధికారులు తమ బకాయిల కింద జమ చేసుకుంటున్నారని పాలకవర్గ సభ్యులు తెలిపారు. సంఘానికి పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నాయి. సంఘం ఆస్తుల ముందు అప్పు చిన్నదే అయినప్పటికీ కొందరు రాజకీయ స్వార్థంతో సంఘంపై అభాండాలు వేస్తూ సంఘ, పాలకవర్గ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సహకార సంఘంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని సెక్షన్ 51ప్రకారం విచారణ జరిపారు. సహకార సంఘం సివిల్ సప్లైకి సుమారు 40వేల క్వింటాళ్ళ బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీని విలువ సుమారు 9కోట్లకు పైగా ఉంది. ఈ విషయమై ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో విచారణ అధికారులు సభ్యులకు వివరించారు. ప్రస్తుత పాలకవర్గంతో పాటు కార్యదర్శిని బాధ్యులుగా చేస్తూ సుమారు ఒక్కొక్కరికి 50లక్షలకు పైగా కట్టాలని ఆదేశాలు జారీ చేశారు. తమ ప్రమేయం లేకుండానే తమని బాధ్యులు చేయడంపై పాలకవర్గ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇదిఇలా ఉండగా సహకార బ్యాంకు అధికారులు కొత్తగా నోటీసులు జారీ చేసి ఆస్తులను వేలం వేస్తామని ప్రకటించడంపై సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘంలో 2018 వరకు కొనసాగిన పాలక వర్గంలో సుమారు 7కోట్ల రూపాయల అప్పులు ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత పాలకవర్గం అప్పులను తీర్చే క్రమంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు సంఘ ప్రతిష్టను దిగజారుస్తున్నాయి. సమగ్ర విచారణ జరిపాలని సంఘ సభ్యులు డిమండ్ చేస్తున్నారు.

‘సీఎంను విమర్శించే నైతిక హక్కు ప్రశాంత్‌రెడ్డికి లేదు’



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇట్టెడి నర్సారెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్ మండలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి అధికారం, ఆర్భాటలు లేకపోవడం వల్ల మతిభ్రమించి సీఎం రేవంత్‌రెడ్డిపై అనవసరమైన విమర్శలు చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి గురించి ఓటుకు నోటు విషయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడడం నైతికహక్కు లేదన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలను బహిరంగంగా సుమారు రూ.50నుంచి రూ.100కోట్లు ఓటర్లకు పంచిపెట్టి చివరి క్షణాల్లో అతితక్కువ మెజారిటీతో గెలుపొందిన వేములప్రశాంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదర్‌గౌడ్, బద్దం మహేందర్, రమేష్, అశోక్, సతీష్, సుమన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బైక్ ప్రమాదంలో ఇద్దరి మృతి

మోర్తాడ్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో జరిగింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందినమ మహమ్మద్ సోహెల్(29), ఆయన బంధువు మహమ్మద్ సుమేర్(19) యువకులు గ్రామంలో రాయలెండ్ ఫీల్డ్ వాహనంపై మద్యం తాగి అతివేగంగా వెళ్తూ గ్రామంలోనే టెలి ఫోన్ స్తంభానికి ఢీకొట్టడం తో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. మహమ్మద్ సోహెల్ పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో అజాగ్రత్తగా నడపడంతో ఈ సంఘ టన జరిగిందని భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. విషయం తెలి సిన వెంటనే ఎస్సై విక్రం,భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్ సంఘటన స్థలా నికి చేరుకొని వివరాలు సేకరించారు. అప్పటికే తీవ్రగాయాలైన వారిని బతుకుతననే ఆశతో ఆర్మూర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యు లు తెలిపారని సీఐ తెలిపారు. సోహెల్ భార్య మహ మ్మద్ రజీయా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిర్వ హించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడు సోహెల్‌కు భార్య, రెండేళ్ల కూతు రు ఉంది. సుమేర్ మెట్‌పల్లి మండలం యుసుబ్ నగర్‌కు చెందినవాడని అని తెలిపారు. ఈసంఘటన గ్రామంలో గ్రామస్థులను తీవ్రంగా కలిచివేసింది.




సోహెల్(ఫైల్) సుమేర్(ఫైల్)

మున్సిపల్ పరిధిలో మాస్టర్ ప్లాన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సహకారంతో మాస్టర్ ప్లాన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో మాస్టర్ ప్లాన్ సర్వేను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ 2.0 బృహత్ ప్రణాళిక పథకంలో భాగంగా సర్వే ఆఫ్ఇండియా రాష్ట్రవ్యాప్తంగా 50వేల నుంచి లక్షలోపు జనభా కలిగిన 20 పట్టణాలను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిందని, అందులో భాగంగా మున్సి పల్‌లో డ్రోన్ సహకారంతో 36వార్డులకు సుమారు 11వేల350ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రతీ అంశాన్ని మాస్టర్ ప్లాన్‌లో వచ్చిందని, దాని ఆదారంగా అభివృద్ధి చెందు తుందని ఆయన అన్నారు.12రోజులలో సర్వేనుపూర్తి చేసి మాస్టర్‌ప్లాన్‌ను రూ పొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికను రూపొందిస్తామని ఆయన తెలిపారు.

బట్టాపూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

ఏర్గట్ల,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామంలో సో మవారం స్థానిక యువకుల ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను మూడ్ దయానంద్ ప్రారంభించారు. ఈపోటీల్లో పాల్గొనే జట్లు వెయ్యిరూపాయలు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని, గెలిచిన మొదటి జట్టుకు పది వేలు, ద్వితీయ బహుమతి ఐదువేలతో పాటు విజేతలకు బహుమతలు అందజేస్తామని, జట్లనమోదుకై 8185035654,8179523239,703673505లకు సంప్రదించాలన్నారు.

అర్గుల్‌లో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ రథోత్సవంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, తాజామాజీసర్పంచ్ గోర్త పద్మరాజేందర్, తాజామాజీ ఎంపీటీసీ జైడి అనిత చిన్నారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రూరల్ సింగిల్‌విండోల చైర్మన్లు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సోమవారం నిజామాబాద్‌రూరల్ సింగిల్‌విండోల చైర్మన్‌లు కలిశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని శాలువ, మెమోంటోతో సన్మానించారు. సింగిల్‌విండోల పదవి కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించడం పట్ల నిజామాబాద్‌రూరల్‌లోని వివిధ గ్రామాల సింగిల్‌విండోల చైర్మన్‌లు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి సింగిల్‌విండో చైర్మన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్గుల్, కొలిప్యాక్, బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, నాగుల శ్రీనివాస్, కాట్‌పల్లి నర్సారెడ్డి, రూరల్ నియోజకవర్గంలో గ్రామాల సింగిల్‌విండోల చైర్మన్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన వివిధ గ్రామాల సింగిల్ విండోల చైర్మన్లు

విద్యార్థులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ



విద్యార్థులకు కంటి పరీక్షలను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యాసిస్తున్న విద్యార్థినులను కంటి పరీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని జీజీహెచ్ ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. గతంలో ఆర్‌డీఎస్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాల హాస్టళ్లలో ఉంటున్న సుమారు 90వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 5300మంది విద్యార్థులకు కంటి సమస్యలు వచ్చాయని, వారికి కంటి అద్దాలు అందించడంలో జాప్యం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ వరకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్, ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్, ఆర్ఎంఓ అమృత్‌రాంరెడ్డి, డాక్టర్ అజయ్, డాక్టర్ స్నేహ, డాక్టర్ భుజంగరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్లపై పట్టింపేదీ..!?

● కనిపించని సీసీ కెమెరాలు ● ఒకేరోజు రెండు పెళ్లిళ్లు ● ఫైర్ సేఫ్టీ పరికరాలు కరువు
● శానిటేషన్ విభాగానికి అదనపు భారం ● నిబంధనలు పాటించని యజమానులు ● పట్టించుకోని జిల్లా అధికారులు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం మొదలై పెళ్లిళ్ల సీజన్‌తో ఫంక్షన్ హాళ్లు కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన ఫంక్షన్ హాల్‌లో రెండు శుభకార్యాలు జరుగుతున్నాయి. ఉదయం వివాహం, సాయంత్రం డిన్నర్ వంటి కార్యక్రమాలతో ఫంక్షన్ హాళ్లు బిజీ బిజీగా మారాయి. కాని ఫంక్షన్ హాళ్లపై పర్యవేక్షణ కరువైంది. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో సంబంధిత అధికారుల నిఘా కరువైంది. నిత్యం పెళ్లిళ్లు, పుట్టిన రోజు ఇతరత్రా వేడుకలు నిర్వహించుకునే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం, శుభకార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులకు గురి చేస్తుంది. సీసీ కెమెరాలు లేకపోవడం సందట్లో సడేమియా అంటూ దొంగలకు కలిసి వస్తుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంగా వందల సంఖ్యలో గుమిగూడి ఉండే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాట్లపై అటు పోలీసులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.

● నిఘాతో అడ్డుకట్ట

సీసీ కెమెరాలు ఉంటే శుభకార్యాలు చేసుకునే వారికి అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. ఫంక్షన్ హాళ్లకు వచ్చే మహిళల బంగారు ఆభరణాల చోరీ ఘటనలు జరిగే అవకాశలు ఉండవు.

● ఫైర్‌సేఫ్టీ అనుమతులు కరువు

ఫంక్షన్ హాల్ నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాలలో జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వీరితో పాటు అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ అనుమతి ఉండాలి. ఫంక్షన్ హాల్ నిర్మాణ సమయంలో ముందస్తుగా ప్రొవిజినల్ ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఒరిజినల్ ఫైర్‌సేఫ్టీ అనుమతి తీసుకోవాలి. ఫంక్షన్ హాల్స్‌లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచితేనే ఫైర్‌సేఫ్టీ అనుమతి ఇస్తారు. కాని జిల్లాలో సుమారు 50 వరకు ఫంక్షన్ హాళ్లు ఉండగా కేవలం కొన్నింటికి మాత్రమే ప్రొవిజినల్ ఎన్‌వోసీ ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఐదేళ్లకు ముందు నిర్మించిన వాటికి అనుమతులు లేవని ఐదేళ్ల నుంచే ఈ అనుమతులు తీసుకుంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు. శుభకార్యాలు జరిగినప్పుడు భోజన విస్తరాకులు, ఇతర వ్యర్థాలు మున్సిపల్ శానిటేషన్ విభాగానికి తీసుకెళ్లడం అదనపు భారంగా మారింది. నిత్యం పెళ్లిళ్ల సీజన్‌లో రెండు పెళ్లిళ్లు జరిగే సరికి ఫంక్షన్ హాల్‌లోని చెత్తాచెదారం తీసుకెళ్లడం వారికి భారంగా మారింది.



బోధన్‌లోని ఫంక్షన్ హాల్ దృశ్యం

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్, బోధన్



ఫంక్షన్ హాల్‌లో పర్యావరణాన్ని పరిరక్షించడానికి యజమాన్యాలు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌లను వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.

ఫటా..ఫట్...

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● గంగామణి, ప్రత్యేక అధికారిణి, కస్తూర్బా పాఠశాల, ఆర్మూర్



ఆంధ్రజ్యోతి: కస్తూర్బా పాఠశాలలో ఎంత మంది విద్యార్థినులు ఉన్నారు?

ప్రత్యేక అధికారిణి: మొత్తం 316 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇందులో పాఠశాలలో 205, ఇంటర్ విద్యార్థినులు 111మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ప్రత్యేక అధికారిణి: పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు ఉదయం గంట పాటు, సాయంత్రం గంట పాటు అదనంగా తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందుతున్నాయా?

ప్రత్యేక అధికారిణి: విద్యార్థినులకు పుస్తకాలు, యూనిఫాం, రికార్డు బుక్స్, ఉలాన్ బ్లాంకెట్లు అందజేశాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో సమస్యలు ఉన్నాయా?

ప్రత్యేక అధికారిణి: పాఠశాల ప్రహరీ కొంత మేరకు కూలిపోయి ఉంది. దానిని నిర్మించాల్సి ఉంది. అధికారులకు విన్నవించాం. అదే విధంగా మైదానంలో మొరం వేయాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థినులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారా?

ప్రత్యేక అధికారిణి: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం. ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ అండర్-16 విభాగంలో ఆర్మూర్ పాఠశాలకు చాంపియన్‌షిప్ లభించింది.

●(ఆంధ్రజ్యోతి,ఆర్మూర్‌రూరల్)

పాలెం విద్యార్థుల క్షేత్ర సందర్శన

మోర్తాడ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ధోన్‌పాల్ పాఠశాలకు క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఉన్నత పాఠశాలలో బోధన విధానం, డిజిటల్ బోధన గురించి విద్యార్థులు వీక్షించారు. పాఠశాలలోని గ్రంథాలయం, సైన్స్ ల్యాబోరేటరి, కిచెన్ గార్డెన్, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో

ఈజీఎస్ పనులపై కూలీల ఆసక్తి


ఉపాధి పనుల్లో కూలీలు


ఉపాధి కూలీలుగా పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు

మద్నూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకం ఉపాధి హామీ పథకం పనులకు అనుసంధానం చేయడంతో ఈసారిఎక్కువ మంది పనుల్లో పాల్గొనే అవకాశం కనిపిస్తుంది. ఈజీ ఎస్ కార్యాలయానికి కూలీలు తరలివచ్చి కొత్తగా జాబ్ కార్డుకావాలంటూ కోరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఇందుకు సంబంధించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చేపట్టబోయే పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే గతంలో కంటే ఈసారి భిన్నంగా ఈజీఎస్ పనులకు డిమాండ్ రాబోతున్నట్లు తెలుస్తుంది. కామారెడ్డి జిల్లాలో 2.50222 లక్షల మంది జాబ్ కార్డులు తీసుకోగా అందులో 1.25001 మంది మాత్రమే ఉపాధి పథంలో పాల్గొంటున్నారు. అయితే ఈసారి రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రవేశపెట్టి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున మంజూరు పథకానికి శ్రీకారం చుట్టింది. ఏడాదిలో రెండు సార్లు రూ.6 వేల చొప్పున రూ.12 వేలు అందించనున్నారు. కనీసం ఏడాదిలో 20 రోజులుగా ఉపాధి పనుల్లో పాల్గొని ఉండాలని నిబంధనలు విధించడంతో కొద్ది మందికి మాత్రమే అర్హత లభించింది. ఈసారి ఉపాధి పనుల్లో పాల్గొనే పరిస్థితి కనిపిస్తుంది.

● కొత్త జాబ్ కార్డులపై వెలువడని నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్ కార్డులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం పాత కార్డులు ఉన్న వారికి ఉపాధి పనులు నడుస్తున్నాయి. ఈజీఎస్ కార్యాలయానికి కూలీలు జాబ్ కార్డు కావాలంటూ తరలివస్తున్నారు. ముందుగా గ్రామ పంచాయితీలో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ పంచాయితీ వారు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించి వారు పనికి అర్హులేనా కాదా? అన్న తరువాతనే ఈజీఎస్ కార్యాలయానికి నివేదిక పంపించిన తరువాతే వారికి జాబ్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది.

చురుగ్గా కొనసాగుతున్న రైల్వే డబ్లింగ్ పనులు

● 2026లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యం



నవీపేట రైల్వే స్టేషన్


నవీపేట రైల్వే స్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న పనులు


నవీపేట శివారులో డబ్లింగ్ కోసం ఎర్త్ పనులు చేపట్టిన దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని మేడ్చల్ నుంచి మహారాష్ట్రలోని ముఖేడ్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు మంజూరు కాగా మండలంలోని మహంతం రైల్వే గేటు నుండి బాసర వరకు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. దీనికి సంబంధించి గత కొంత కాలంగా భూమి చదును పనులు పూర్తి చేయగా ప్రస్తుతం ఎర్త్ పనులు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్ నుండి ముంబాయి వెళ్లే ఈ రైలు మార్గంలో రైల్వే డబ్లింగ్ లేకపోవడంతో పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్లు సకాలంలో గమ్యానికి చేరుకోలేక పోతున్నాయి. డబ్లింగ్ పనులు పూర్తయితే ఇరువైపుల నుండి వచ్చే రైళ్లకు క్రాసింగ్ బెడద తొలగిపోనుంది. దీనికి సంబంధించి నవీపేట రైల్వే స్టేషన్‌లో 2వ ప్లాట్‌ఫామ్ ఏర్పాటుతో పాటు ఫకీరాబాద్ స్టేషన్‌లో రైల్వే ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులు సైతం చేపట్టనున్నారు. డబ్లింగ్ పనులకు సంబంధించి పలు చోట్ల భూసేకరణ అవసరం ఉందని రెవెన్యూ అధికారులు సహకరిస్తే పనులు మరింత వేగంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. 2026లోగా డబ్లింగ్ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా శివస్వాముల ఊరేగింపు


దోమకొండలో శావ నిర్వహిస్తున్న శివ స్వాములు

దోమకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం శివస్వాములు శావ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. చాముండేశ్వరీ ఆలయం, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, అంగడి బజార్, బురుజు మీదుగా శావను ఊరేగించారు.కార్యక్రమంలో శివ స్వాములు, శివ భక్తులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహా కుంభాభిషేక ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని కిసాన్‌గంజ్‌లో గల పట్టణ ఆర్యవైశ్య సంఘంలో జరిగిన మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొని పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్ర మానికి వైశ్య పీఠాధిపతి హళ దీపుర వామనాశ్రమ మహా స్వా మి మంగళ శాసనములతో మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు పార్శి ఆత్మారాం గుప్త, పెద్ది రాజేందర్‌గుప్త, పెండ్యాల శ్రీనివాస్‌గుప్త, పాల్తి రవికుమార్ గుప్త, పారిశ్ర రాఘవేందర్‌గుప్త, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు ఇల్లెందుల ప్రభాకర్‌గుప్త, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌ను సన్మానించిన అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు సాధించిన అనంతరం మొదటిసారిగా నగరానికి వచ్చిన సందర్భంగా ఎంపీని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, పవన్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు


కమలాపూర్ అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న మహిళలు


చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్‌లోని శ్రీ అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, చండీయాగం, సామూహిక లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎర్రజొన్న వ్యాపారుల సిండికేట్

● రైతులను నట్టేట ముంచే ప్రయత్నాలు
● ఎర్రజొన్న సాగు విస్తీర్ణం తగ్గినా పెరగని ధర

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంత ప్రధాన వాణిజ్య పంట అయిన ఎర్రజొన్నలు, తెల్లజొన్నల ధర తగ్గించేందుకు విత్తన వ్యాపారులు రంగం సిద్ధం చేసుకున్నారు. సిండికేట్‌గా మారి రైతులను నిలువున ముంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. గత సంవత్సరం ఎర్రజొన్న క్వింటాలుకు రూ.4వేలతో ప్రారంభమై రూ.3600 వద్ద స్థిరంగా ఉంది. తెల్లజొన్నలకు సైతం ధర బాగానే పలికింది. విత్తన వ్యాపారులు ఇటీవల గుజరాత్‌లో సమావేశమై సిండికేట్‌గా మారారని ఆర్మూర్ ప్రాంతంలో ప్రచారం జరుగుతోంది.

తగ్గిన ఎర్రజొన్న సాగు విస్తీర్ణం

ఆర్మూర్ సబ్‌డివిజన్ గ్రామాల్లో గతంతో పోలిస్తే ఈ సారి ఎర్రజొన్న పంట సాగు గణనీయంగా తగ్గింది. ఎర్రజొన్న సాగు చేసిన రైతులు మొక్కజొన్న వైపు మళ్ళడంతో విస్తీర్ణం తగ్గింది. హైబ్రిడ్ మొక్కజొన్న, సీడ్ మొక్కజొన్నకు డబ్బులు ఎక్కువగా వస్తుండడంతో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతంలో ఆర్మూర్ మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాలలో జొన్న పంట సాగు చేయగా ప్రస్తుతం 5500 ఎకరాలకు పరిమితమైంది. గతంలో డివిజన్ స్థాయిలో సుమారు 45వేల ఎకరాల్లో ఎర్రజొన్న పంట సాగయ్యేది. ప్రస్తుతం 32వేల294 ఎకరాల్లో ప్రస్తుతం సాగవుతుంది. వివిధ మండలాల్లో ఎర్రజొన్నకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేయడంతో విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో ఎర్రజొన్న విస్తీర్ణం తగ్గడంతో ఈయేడు ఎర్రజొన్నలకు క్వింటాలుకు రూ.4వేలకు పైగా ధర వస్తుందని రైతులు ఆశించారు. విత్తన వ్యాపారుల మాయ జాలంతో ధర వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎర్రజొన్న క్వింటాలుకు రూ.3700, తెల్లజొన్న క్వింటాలుకు రూ.3000 చెల్లించాలని నిర్ణయించినట్టు తెలిసింది.


ఆర్మూర్ ప్రాంతంలో సాగవుతున్న ఎర్రజొన్న పంట


ఆరబోసిన ఎర్రజొన్నలు

అధికారుల ఆదేశాలు బేఖాతరు

ఎర్రజొన్న వ్యాపారులు అధికారుల ఆదేశాలు పట్టించుకోవడంలేదు. పంట విత్తడానికి ముందే గత సెప్టెంబర్ 26వ తేదీన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రైతులు, లైసెన్స్ కలిగిన విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వ్యాపారులు సీడ్ ఇచ్చే ముందు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలని అధికారులు వ్యాపారులకు, రైతులకు సూచించారు. రైతులను మోసం చేయడానికి పక్క ప్రణాళికతో ఉన్న వ్యాపారులు అధికారులు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలన్న అధికారుల ఆదేశాలను పట్టించుకోవడంలేదు. తాజాగా సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్‌లో బీజేపీ మండల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నియామకమైన బీజేపీ మండలాధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసిన పార్టీగా ఒక్క బీజేపీకే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. మేధావులు ఆలోచించి బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, జి.నగేష్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణా రెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రారెడ్డి, బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రాంచందర్

యాదగిరి వారసత్వాన్ని కొనసాగిద్దాం

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రెటరీయేట్ సభ్యుడు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్నాటి యాదగిరి త్యాగాల వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రెటరీయేట్ సభ్యుడు రాంచందర్, రమ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన యాదగిరి సంతాపసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాన్ని తృణప్రాయంగా త్యజించి జీవితాంతం విప్లవోద్యమే జీవితంగా యాదగిరి బతికారని అన్నారు. యాదగిరి కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శమన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా సుమారు 33 ఏళ్లు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా 4 దశాబ్దాలకు పైగా పనిచేశారని అన్నారు. జీవితాంతం ఆదర్శంగా నిలిచి మరణించిన తర్వాత కూడా వైద్య విద్యార్థుల పరిశోధన కోసం శరీరాన్ని చూపుకోసం నేత్రాలను దానం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వనమాల కృష్ణ, నరేందర్, రామకృష్ణ, వెంకన్న, దేవరాం, రాజేశ్వర్, సుధాకర్, గంగాధర్, ముత్తెన్న, సాయన్న, మల్లేష్, సురేష్, కిషన్, రాజన్న, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం పనిచేయాలి


పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికతో పాటు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సీరియస్‌గా కష్టపడాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సూచించారు. నగర ముఖ్య నాయకులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికను కాంగ్రెస్ పార్టీ సీరియస్‌గా తీసుకుందని, ప్రతీ ఒక్కరు కష్టపడి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పీసీసీ అధ్యక్షుడి సొంత జిల్లా అయినందున పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ గెలిస్తేనే నాయకులకు, కార్యకర్తలకు విలువ ఉంటుందని కావున ప్రతి ఒక్కరు విభేదాలు విడిచి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


సివిల్ సప్లయి కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం 2005 పరిధిలో రికార్డుల పరిశీలనకు అధికారులు అనుమతించిన క్రమంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మలు బియ్యం మిల్లుల రికార్డులను సోమవారం జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో పరిశీలించారు. జిల్లాలోని 41 రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన రూ.417 కోట్ల విలువైన బియ్యం బకాయి పడ్డ క్రమంలో వారిపై అధికారులు తీసుకున్న చర్యలు, కేసుల వివరాలు కోర్టులో నమోదు చేసిన సెక్షన్లు తదితర వివరాల ఫైళ్లు పరిశీలించారు. 41 రైస్‌మిల్లులలో బోధన్, వర్నిపేట, గుండారం, ఖానాపూర్, వేల్పూర్‌లలో 6 మిల్లులు 2014-15 నుంచి బకాయిలు, కేసులు నడుస్తూనే ఉన్నాయని మిగతా అనేక మిల్లులపై బకాయిపడ్డ ఒక సంవత్సరంలోనే అధికారులు కఠిన చర్యలు చేపట్టకుండా ఇటీవల కేసులు నమోదు చేయించడం రికార్డులలో కనిపించింది. ఇప్పటికే వినియోగదారుల మండలి న్యూఢిల్లీలో సెంట్రల్ విజిలెన్స్ కమీషన్‌కు ఫిర్యాదు చేసిందని అధికారుల నుంచి పూర్తిసమాచారం అందిన మీద హైకోర్టులో ప్రజాప్రయోజనాల వాజ్యం దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత


పోలీసులు పట్టుకున్న జేసీబీ, ట్రాక్టర్లు

సిరికొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సిరికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని గడ్కోల్ కప్పలవాగు నుంచి సోమవారం ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, జేసీబీని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం పోలీసు నిఘా ఉండదని దాంతో గడ్కోల్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకాగౌడ్‌కు చెందిన జేసీబీతో రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారని తెలిసిన సమాచారం మేరకు ఎస్సై ఎల్.రామ్ ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

మోపాల్: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాస్బాగ్ తండాలో అక్రమంగా ఆదివారం రాత్రి ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుత్ వ్యాకిమ్ సర్క్యూట్ ప్రారంభం

మోపాల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు సోమవారం మంచిప్ప గ్రామంలో నూతనంగా వ్యాకిమ్ సర్క్యూట్‌ను సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు విద్యుత్ అంతరాయం ఉండకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇకనుండి విద్యుత్ సమస్య ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ రమేష్, డీఈ ఉత్తమ్ జాడే, ఏడీఈ బాలేష్‌కుమార్, ఏఈ నాగశర్మణి, లైన్‌మెన్ శ్రీనివాస్, మహిపాల్, సంజీవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


హాజరైన అధ్యాపకులు

● కాకతీయలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ అకాడమిక్ విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ప్రాక్టికల్ నాలెడ్జిని విద్యార్థులకు అందించాలని విద్యార్థులకు వారి భవిష్యత్తుకు ఉపయోగపడే దిశగా శిక్షణ అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కోరారు. సోమవారం నగరంలోని కాకతీయ విద్యాసంస్థల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను తమ తల్లిదండ్రులు ప్రేమతో పెంచుతూ విద్యను నేర్పే గురువుల పట్ల భక్తిభావంతో మెలగాలని అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థుల విషయంలో అకుంఠిత భావంతో విద్యను అందించాలని విద్యార్థులు కూడా పూర్తి శ్రద్ధతో విద్యను అభ్యసించాలని ఆయన కోరారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

మార్చిలో జరిగే పది, ఇంటర్ పరీక్షలను మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ సుదర్శన్‌రెడ్డిని కోరారు. విద్యార్థులంతా పూర్తిగా చదువుకొని పరీక్షలు రాయాలని మాస్ కాపీయింగ్‌పై ఆధారపడవద్దని సూచించారు. కాకతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులను కంటికి రెప్పలుగా చూసుకుంటూ నైపుణ్య విద్యను అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డిని డైరెక్టర్ రజనీకాంత్, ప్రిన్సిపాల్ ఫరీదుద్దీన్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, రత్నాకర్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేసీఆర్‌కు తెలంగాణ చరిత్ర ఫొటో ఆల్బాంను అందజేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్/వేల్పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సిద్దిపేట జిల్లా ఎర్రబెల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆయనకు బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు తెలంగాణ చరిత్రకు సంబంధించిన ఫోటో ఆల్బమ్‌ను అందజేశారు. ఆయనతో పాటు పార్టీ నేతలు కూడా మాజీ సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

సుభాష్‌నగర్: మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త సోమవారం కేసీఆర్ ఎర్రబల్లి నివాసంలో కలిసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా కేసీఆర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మొక్కను బహూకరించారు. అలాగే నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన విభాగం నాయకులు అభిలాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూకిరణ్, ప్రభాకర్‌రెడ్డి, సిర్పరాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, లక్ష్మారెడ్డి, చిన్నరాం, ప్రశాంత్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌ల జన్మదిని వేడులకు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, పార్టీ నాయకులు భుజేందర్, సంతోష్‌రెడ్డి, చిన్నారెడ్డి, అన్సార్, భూషన్‌రెడ్డి, రాజు, లస్కర్ రఘుదాస్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావ్ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ శుభకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాంకిషన్‌రావ్, బీఆర్‌ఎస్ నేత ఉన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదినం సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. శివాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు కేక్ తినిపించుకొని కేసీఆర్, బాజిరెడ్డి గోవర్ధన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి సాయిలు, ఒడ్డం నర్సయ్య, పద్మారావు, జైపాల్, గిరి, అంజయ్య, తిరుపతి, నహీం, సతీష్‌రెడ్డి, ప్రవీణ్, జాకీర్, నర్సయ్య, వినోద్, రవీందర్, శ్రీను, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా అనంతపద్మనాభ స్వామి కల్యాణోత్సవం

● పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని అనంతపద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం వేదపండితుల సమక్షంలో అనంతపద్మనాభ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రూరల్ మండల ప్రజలే కాకుండా నిజామాబాద్ నగర ప్రజలు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, అగ్గు భోజన్న, భాగిర్తి బాగారెడ్డి, బాగారెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆయల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో పంచామృతలతో అభిషేకాలు, రామాలయం, అయ్యప్ప ఆలయం, దత్తాత్రేయ, దుర్గామాత, ఏకశిల స్తంభం వద్ద హన్మాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవలో భక్తులు భజన మండలి భక్తులు నృత్యాలు చేశారు. ప్రతీ సోమవారం అందించే అన్నప్రసాదాన్ని ఆలయ కమిటీ భక్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, బోండ్ల ఆనంద్, కొంతం మురళీ, ఆలయ కమిటీ సభ్యులు, సేవ సమతి సభ్యులు పాల్గొన్నారు.

ఆహార కల్తీపై అవగాహన సదస్సు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీ మహమ్మారిపై అంగన్‌వాడి కేంద్రాల్లో విజిలెన్స్ కమిటీలలో వినియోగదారుల ప్రతినిధులను ఆహ్వానించామని తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం తహసీల్దార్ కిరణ్మాయికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార కల్తీపై అవగాహన కల్పించారు. ఈ వినియోగదారుల ప్రతినిధులు విజిలెన్స్ కమి టీలలో వినియోగదారుల ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వర్మ, ప్రధానకార్యదర్శి ప్రవీన్, రూరల్ ఇన్‌చార్జీ దేవేష్, గైని రత్నకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్‌లు పాల్గొన్నారు.

చంద్రయాన్‌పల్లిలో ఒకరి దారుణ హత్య

ఇందల్వాయి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన ఇందల్వాయి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చంద్రయాన్‌పల్లి శివారులో 44వ జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తిని దుండగులు దారుణంగా హతమార్చారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో రైతులు పంటపొలాలకు వెళ్తుండగా కాలి బూడిదైన వ్యక్తి మృతదేహం లభించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తిని హతమార్చి కాలిబూడిద చేసి ముళ్లపొదల్లో కాల్చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ఒంటిపై జీన్స్‌ప్యాంట్, నల్లచొక్కా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

మల్లారం జగదాంబ ఆలయంలో చోరీ

మోపాల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారం గొల్లగుట్ట ప్రాంతంలో ఉన్న జగదాంబ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చొరబడి తులంన్నర బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారని ఆలయ కమిటీ పెద్దలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం

ముప్కాల్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రం శివారులో చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్టు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తికి 30ఏళ్లకు పైగా ఉంటాయని, తెలుపు, బుడిదరంగు డబ్బాల చొక్క, గొదుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, నలుపు రంగు గల వ్యక్తి అని, మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపర్చామని, ఆచూకి తెలిసిన వారు ముప్కాల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆర్మూర్‌రూరల్ సీఐ 8712659859నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు నగరంలో

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం ఏర్పడుతున్నట్లు టౌన్-3 ఏడీఈ వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేయడానికి ఉదయం 9.30ల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగరంలోని పద్మనగర్, హనుమాన్‌నగర్, యాదగిరిబాగ్, కోటగల్లి, జెండాగల్లి, ఆర్యసమాజ్, గడీబజార్, దోబీఘాడ్, గోసంగి కాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

20న 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి


సిరికొండలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిరికొండ,ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే చలో హైదరాబాద్ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య పార్టీ కార్యకర్తలను కోరారు. సోమవారం పోస్టర్లను ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14నెలలు అయినా హామీలు అమలులో పూర్తిగా విఫలమయిందని విమర్శించారు.రైతు భరోసా, మహిళలకు మహాలక్ష్మి పథకం, వృద్దులకు 4000పింఛను, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మరచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం కోసమే ఈనెల 20న హైదరాబాద్‌లో భారీ ఊరెగింపు, బహిరంగసభ ఏర్పాటు చేశామని ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు మార్క్స్, జాకీర్, గంగాధర్, సుధాకర్, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'లను అమలు చేయాలి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచిందని ఇంతవరకు ఇచ్చిన హామీలలో ఉచిత బస్సు తప్ప.. మిగతా గ్యారంటీల విషయం జాడలేదని అన్నారు. బీడీ కార్మికుల చేయూత పథకం, నాలుగు వేల 16రూపాయలు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా, వికలాంగుల, వితంతువుల, ఒంటరి మహిళ పెన్షన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 20న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుప్రియ, రాజు, గంగాధర్, సాయిలు, లలిత, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఐఏడబ్ల్యూయూ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఏఐఏడబ్ల్యూయూ నాయకులు పెద్ది వెంకట్రాములు

ఖిల్లా, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా తరగతులు విజయవంతంగా ముగిసినట్లు ఏఐఏడబ్ల్యూయూ జిల్లా ప్రధానకార్యదర్శి పెద్దివెంకట్రాములు అన్నారు. ఈనెల 15,16,17తేదిల్లో నిర్వహించిన రాజకీయ అవగాహనా శిక్షణా తరగుతలకు హాజరైన ప్రతినిధులకు, రాష్ట్ర కేంద్రం నుంచి వచ్చిన ముఖ్య అతిథులకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రిప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, సిఐటియు జిల్లా నాయకులు మరికంటి నాగేశ్వర్, ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు రమేష్‌బాబు,రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగంలకు తరగతులు విజయవంతం అయ్యేందుకు దోహదపడిన సంఘం కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రెండు లక్షల నలభై నాలుగు వేల కోట్ల రూపాయలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కెటాయించినట్లయితే యంత్రాల రాకతో పని దొరకని వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుందని, బోగస్‌జాబ్ కార్డులను ఏరివేస్తూ జాబ్‌కార్డు లేని వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డులు లేని వారికి కొర్రీలు పెట్టకుండా రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో క్షేత్రస్థాయి నుంచి ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88200	రూ.81400	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (10.45, 7.20)
: లైలా (1.25): తండేల్ (4.15, 10.00)
స్క్రీన్-2: చావా (హిందీ) (10.00, 4.00, 10.25)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.20)
: తండేల్ (7.20)
స్క్రీన్-3 : తండేల్ (10.30)
: నిదిరించు జహపనా (1.35)
: లైలా (4.10) : చావా (హిందీ) (7.00)
: సనం తేరీ కసమ్ (హిందీ) (10.20)
స్క్రీన్-4 : తాలా (10.55)
: సంక్రాంతికి వస్తున్నాం (1.35, 7.40)
: బ్రహ్మ ఆనందం (4.35) : లైలా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : చావా (హిందీ) (11.00, 1.40, 7.30, 10.20)
: తండేల్ (4.30)
స్క్రీన్-2 : తండేల్ (11.00, 1.45, 7.40, 10.20)
: చావా (హిందీ) (5.00)
స్క్రీన్-3 : లైలా (10.45, 1.45, 7.35, 10.20)
: బ్రహ్మ ఆనందం (4.30)



దేవి: లైలా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్